## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ : 11కేవీ గాజువాక ఫీడర్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు గురువారం తెలిపారు. ఈ మేరకు ఈ ఫీడర్ పరిధిలోని యాతపాలెం, దిబ్బపాలెం కాలనీ, అశోక్ నగర్, ప్రియదర్శిని కాలనీలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం తప్పదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### నేత్ర వైద్య శిబిరం విజయవంతం



నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దల్లి గోవింద్

పెదగంట్యాడ: అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గొడ్డువానిపాలెంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం నేత్ర వైద్య నిపుణులు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని అదానీ గంగవరం పోర్టు సీఎస్సార్ మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు.

### నేడు గుడివాడ గురునాథరావు వర్ధంతి

అక్కిరెడ్డిపాలెం: మాజీ మంత్రి స్వర్గీయ గుడివాడ గురునాథరావు 23వ వర్ధంతిని శుక్రవారం మిందిలో ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ గురువారం తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

### ఉత్సాహంగా బాలవికాస్ దినోత్సవం



బాలలకు వస్త్రాలు పంపిణీ చేసిన సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సమితి ఆధ్వర్యంలో గురువారం బాలవికాస్ దినోత్సవం ఉత్సాహంగా జరిగింది. సత్యసాయి 99వ జయంతి వేడుకలో భాగంగా ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణ, రుద్రాభిషేకాలు నిర్వహించారు. వేదపఠనం, అష్టోత్తర పూజ అనంతరం బాలవికాస్ బాల బాలికలతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం 22 మంది బాలబాలికలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితులకు జైలు, జరిమానా

అక్కిరెడ్డిపాలెం: మద్యం తాగి వాహనాలు నడిపిన 8 మందికి కోర్టు జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష విధించిందని గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 10 మందిపై కేసులు నమోదు చేసి 3వ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, రెండవ తరగతి కోర్టు న్యాయమూర్తి టి.వి.రమణ ఎదుట హాజరు పర్చారు. 8 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించగా లారీ డ్రైవరైన కైలాష్ కుమార్, ఆటో డ్రైవర్ ఎ.శ్రీనుకు 20 రోజుల జైలు, రూ.50 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారన్నారు.



# వేతన.. వేదన





జీతం చెల్లించమని ప్రధానిని కోరుతున్న చిన్నారి (ఫైల్)

- జీతాలు చెల్లించని ఉక్కు యాజమాన్యం
- ఇబ్బందులో ఉద్యోగులు, కార్మికులు
- నోరుమెదపని కార్మిక సంఘాలు

వేతనాల కోసం ప్రతినెలా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఎదురుచూపులు తప్పడం లేదు. యాజమాన్యాన్ని నిలదీయాల్సిన కార్మిక సంఘాలు నోరు మెదపడం లేదు. కనీసం నెలవారీ ఇచ్చే వేతనం కూడా నోచుకోని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలా అరకొర జీతాలతో ఎన్నాళ్లు గడపాలని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.



జీతాల కోసం కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న మహిళలు (ఫైల్)

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సెయిల్ మాదిరిగా నూతన వేతన ఒప్పందం అమలు కావాల్సి ఉంది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వేతన ఒప్పందం కాలేదు సరికదా ఉన్న ఆర్థిక నదుపాయాలు ఒక్కొక్కటిగా కోల్పోతున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం జరిగిన తర్వాత కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సహాయ నిరాకరణ ప్రారంభించింది. ముడి పదార్థాలు అందకుండా, బ్యాంకుల నుంచి రుణాలు అందకుండా చేయకుండా స్థానిక యాజమాన్యాలు స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తున్నాయి. ప్లాంట్ ఉత్పత్తిని కనీస స్థాయికు దిగజార్చాయి. ఈ పరిస్థితిలో ప్లాంట్ నడవడమే కష్టమన్న పరిస్థితికి తీసుకు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యంల వల్ల జరిగిన తప్పిదాలను ఉద్యోగులపై నెట్టేస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

**ఆలస్యంగా.. అరకొరగా జీతాలు..**

ఈ ఏడాది బోనస్ ఇవ్వకపోగా ఏప్రిల్ నుంచి నెలకు రెండు దఫాలుగా 50 శాతం జీతం చెల్లించడం ప్రారంభించారు. అది కూడా వారికి ఇష్టం వచ్చినట్టు ఇస్తుండటంతో ఉద్యోగులు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు డిఫాల్టర్లుగా మారుతున్నారు. రెండు నెలల క్రితం ఉన్న హెచ్‌ఆర్‌ఏను కూడా తీసివేయడంతో పాటు టౌన్‌షిప్‌లో విద్యుత్ యూనిట్ రేటు రూ.8కు పెంచడంతో ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి మరింత క్షీణించింది. సెప్టెంబర్ జీతం అక్టోబర్‌లో సగం మాత్రమే ఇవ్వగా.. అక్టోబర్ నెల జీతం 35 శాతం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో గత రెండు నెలలుగా ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి బాగా క్షీణించింది. ఉద్యోగులకు ఇంటి నిర్వహణతో పాటు గృహ రుణాలు చెల్లింపు, స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు భారంగా మారాయి. గతంలో ఇలాంటి సమయంలో త్రిఫ్ట్ సొసైటీ అండగా నిలిచేది. ప్రస్తుతం యాజమాన్యం వారికి చెల్లింపులు నిలిపివేయడంతో వారూ చేతులెత్తేస్తున్నారు.

**నిస్తేజంగా కార్మిక సంఘాలు**

ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని నిలదీయాల్సిన కార్మిక సంఘాలు నోరు మెదపపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఐటీయూ ఈ అంశంపై గాజువాకలో మహాధర్నా,అమరవీరుల కూడలి వద్ద కొవ్వొత్తుల ర్యాలీ వంటి నిరసనలు చేపట్టగా మిగిలిన ప్రధాన కార్మిక సంఘాలు ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలతో పాటు చోటా కార్మిక సంఘాలు కూడా ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకపోవడంపై కార్మికుల్లో విస్మయం వ్యక్తమవుతోంది. న్యాయంగా పనిచేసిన దానికి జీతం అడగాల్సిన కార్మిక సంఘాలు భయాందోళనతో మెలగడం విమర్శలపాలవుతోంది.

### అప్పుల కోసం తిప్పలు

యాజమాన్యం వద్ద నిధులు ఉన్నప్పటికి జీతాలు ఇవ్వక పోవడంపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతున్నది.

ప్లాంట్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా ఎప్పుడు జీతం ఇస్తారనే చర్చ జరుగుతోంది. ఉద్యోగులు బయట అప్పుల కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్టీల్‌ప్లాంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. మహిళలు, చిన్నారులు రోడ్డుపైకి వచ్చి జీతాలు ఇచ్చి తమ కుటుంబాలను కాపాడాలంటూ నిరసన చేస్తుండటం బాధాకరం.

### ఉద్యమం ఉధృతం



ఉక్కు యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడం అన్యాయం. నిధులు ఉండి జీతం చెల్లించకపోవడం చట్టరీత్యా నేరం. వెంటనే జీతాలు చెల్లించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం. ఈ అంశంలో విశాఖ ఎంపీ జోక్యం చేసుకోవాలి. ప్రధాని విశాఖ వచ్చేలోగా జీతాలు మొత్తం చెల్లించకపోతే మహిళలతో సీఎండీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

– డాక్టర్ బి. గంగారావు, 78వ వార్డు కార్పొరేటర్

### కేంద్ర మంత్రి వచ్చిన తర్వాతే ఈ పరిస్థితి



కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్‌కు వచ్చి రెండు నెలల్లో సరి చేస్తామని చెప్పి వెళ్లిన తర్వాత పరిస్థితి మరింత దిగజారింది. జీతాలు ఇవ్వకూడదని నిర్ణయించిన వారు జీతాలు తీసుకుంటున్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గం. నిధులుండీ కూడా జీతాలు ఇవ్వకపోవడం ఉద్యోగులపై కక్ష సాధింపే.

– జె. అయోధ్యరామ్, స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు

### ఎలా బతకాలి



గత ఆరు నెలలుగా జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. ఈఎంఐలు సకాలంలో కట్టలేక బ్యాంకులకు డిఫాల్టర్లు అవుతున్నాం. అదే విధంగా పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేని పరిస్థితికి చేరుకున్నాం. గత నెల 50 శాతం, ఈనెల 35 శాతం జీతం ఇస్తే ఎలా బతకాలి.

– జి. అప్పలరాజు రెడ్డి, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

## రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో షర్మిల సత్తా



రాష్ట్ర స్థాయి హాకీపోటీల్లో క్రీడా ప్రతిభ చాటిన షర్మిల

అగనంపూడి: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 68వ రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో గాజువాక మండలం కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.షర్మిల సత్తా చాటింది. హాకీ అండర్–14 బాలురు, బాలికల పోటీలు నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విశాఖ జట్టు నుంచి పోటీలో దిగిన 8వ తరగతి విద్యార్థి షర్మిల క్రీడా ప్రతిభతో జట్టును ద్వితీయ స్థానంలో నిలిపింది. ఈమేరకు పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో షర్మిలను అభినందించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రకాశరావు మాట్లాడుతూ క్రీడా పోటీల్లో ప్రతిభ కనపర్చుతున్న షర్మిల జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌ను పొందాలని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు, ఇన్‌చార్జ్ కె.అరుణ, గాయిత్రీ తదితరులు పాల్గొన్నారు.

## చలో కలెక్టరేట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ప్రతినిధులు, పరిరక్షణ కమిటీ నేతలు

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిరక్షణ కోరుతూ వచ్చేనెల 2వ తేదీన జరపతలపెట్టిన చలో విశాఖ కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని పిలుపునిస్తూ రూపొందించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కూర్మన్నపాలెంలోని విశాఖ ఉక్కు పరిరక్షణ నిరాహార దీక్షా శిబిరం వద్ద ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారానికి రక్త చరిత్ర ఉందని, ఎంతమంది త్యాగధనులు రక్తం చిందిస్తే, ప్రాణాలు అర్పిస్తే కర్మాగారం కల సాకారం అయిందన్నారు. ఉత్తరాంధ్రలోని ప్రజా సంఘాలు ఏకతాటిపైకి వచ్చి పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. వచ్చేనెల 2వ తేదీన సరస్వతీ పార్కు నుంచి కలెక్టరేట్ వరకు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బూసి వెంకటరావు, వి.దానం, టి.శ్రీరామూర్తి, రామ్‌ప్రభూ, నూకరాజు, జి.అచ్చిబాబు, పరంధామయ్య, డి.ఆదినారాయణ, పాడి త్రినాధరావు, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, డీసీహెచ్ వెంకటేశ్వర్లు, జీఆర్‌కెనాయుడు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతోనే జ్ఞానసముపార్జన



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ప్రొఫెసర్ జె.ఎం.నాయుడు

గాజువాక : గ్రంథ పఠనంతోనే మనిషికి జ్ఞాన సముపార్జన లభిస్తుందని ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జె.ఎం.నాయుడు అన్నారు. స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలద్వారా వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదవడం అలవర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, లైబ్రేరియన్ ఆర్.నారాయణమ్మ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.తేజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

వీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో జరిగే అన్నదాన మూలనిధికి 68వ వార్డు మింది గ్రామానికి చెందిన అట్ట బ్రహ్మానందరావు, అనిత దంపతులు రూ.10,116 విరాళాన్ని గురువారం దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్టు ప్రతినిధులు బ్రహ్మానందరావు దంపతులను అభినందించారు.

– అక్కిరెడ్డిపాలెం



### వృద్ధుడికి వీల్ చైర్ అందజేత



వీల్ చైర్ అందజేస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

గాజువాక : కేంద్ర ప్రభుత్వ వయోశ్రీ పథకం ద్వారా శ్రీనగర్‌కు చెందిన వీరభద్రరావుకు వీల్‌చైర్ మంజూరైంది. లబ్ధిదారుడికి బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ అమలు చేస్తున్న వయోశ్రీ పథకం ద్వారా వయో వృద్ధులకు అవసరమైన చేతి కర్ర, కమోడ్, వినికిడి యంత్రం, కళ్లజోడు వంటి ఉపకరణాలు ఉచితంగా మంజూరవుతున్నాయన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



నెల్లిముక్కు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈవో

పెదగంట్యాడ: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాలతో పాటు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనం పథకం నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థుల వర్క్ బుక్స్, బోధన తీరుపై ఆరా తీశారు. బోధన, బోధనేతర కార్యక్రమాల్లో మండలంలోని పాఠశాలలు సాధిస్తున్న విజయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు ఇ.శ్రీనివాసరావు, కె.రమణాజీ పాల్గొన్నారు.

### ఆధార్ నమోదులో ఇబ్బందులు

అగనంపూడి: అగనంపూడి సబ్‌పోస్టాఫీస్ ఏర్పాటు చేసి పదేళ్లు కావస్తున్నా, నేటికీ పిన్‌కోడ్ నంబర్ ఆన్‌లైన్ కాకపోవడంతో ఆధార్ కార్డులో నమోదు చేయడం సాధ్యం కావడం లేదని అగనంపూడికి చెందిన నాయకులు పోస్ట్ మాస్టర్ కె.శైలజ దృష్టికి తీసుకువెళ్లారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆమెను సత్కరించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.సత్యనారాయణ, బి.చందు, ఆర్. సంధ్యారాణి పాల్గొన్నారు.

### ఘనంగా జ్యోతి బాల విహార్ వార్షికోత్సవం



బహుమతులు అందజేస్తున్న తబస్సుం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించే సెక్టార్–5 బాలల పాఠశాల జ్యోతి బాల విహార్ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పాఠశాల ఆవరణలో జరిగిన వేడుకలకు స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ అత్తార్ మొహమ్మద్ హనీఫ్ సతీమణి తబస్సుం ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రాణి , స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ప్రతినిధి లలన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబలం పూజ



అంబలం పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలో ఘనంగా పడిపూజ నిర్వహించారు. గురుస్వామి పనస సత్యనారాయణ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు బండారు చందు రమేష్ ఏర్పాటు చేసిన అంబలం పూజలో అగనంపూడి నిర్వాసితకాలనీల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో గురు స్వాములు, పీఠం భక్తులు పాల్గొన్నారు.

## రేపు ఎన్విరాన్‌మెంట్ సైన్స్ కాంగ్రెస్



మాట్లాడుతున్న ఖగేశ్వరరావు

అగనంపూడి: పర్యావరణ విద్య కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ, ఏపీఎస్‌జీసీ సారథ్యంలో అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఆదేశాల మేరకు జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్ –24ను శనివారం నిర్వహించనున్నట్టు ఏపీఎస్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు చెప్పారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణంపై ఆసక్తి పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా స్వీకరించడమే ప్రధాన అజెండాగా ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ అంశాల్లో పోటీలు, ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. వ్యర్థాలతో రూపొందించిన ఉత్తమ పోస్టర్ ప్రదర్శన, పర్యావరణంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో హైస్కూల్ విద్యార్థులు పాల్గొనేలా జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

### స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతం బకాయిలు చెల్లించాలి





కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామస్వామి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతం బకాయిలు వెంటనే చెల్లించాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి డిమాండ్ చేశారు. గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్‌లో 50 శాతం, అక్టోబర్‌లో 35 శాతం మాత్రమే జీతాలు చెల్లించడం దుర్మార్గమన్నారు. రెండు నెలల బకాయిలు కలిపి 115 శాతం తక్షణమే చెల్లించాలన్నారు. ఉద్యోగులు బ్యాంకులకు ఈఎంఐలు కట్టలేక అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందన్నారు. అధ్యక్షుడు వై.టి. దాస్ మాట్లాడుతూ ప్యాకేజీల పేరుతో ప్రజలను మోసం చేస్తూ ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని యాజమాన్యం తీరు సరికాదన్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నా చేయనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, పుల్లారావు, నీలకంఠం, శ్రీనివాస్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దృష్టికి త్రిఫ్ట్ సొసైటీ సమస్య

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీకి యాజమాన్యం చెల్లించాల్సిన నిధులను ఇప్పించేలా చర్యలు చేపట్టాలని త్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గం ప్రతినిధులు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కోరారు. గురువారం సొసైటీ ఉపాధ్యక్షులు కె. ఆనంద్ కుమార్, కార్యదర్శి డి. శ్రీరామచంద్రమూర్తి తదితరులు అమరావతిలో మంత్రిని కలిసి త్రిఫ్ట్ సొసైటీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.